క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

● నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నెక్కొండ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నెక్కొండ తండాలోని దుర్గమ్మ గుడిలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. తండాలో దుర్గమ్మ ఆలయాలు నెలకొల్పడంతో గిరిజనుల్లో దైవ భక్తి పెంపొందించాలని ఆకాంక్షించారు. అనంతరం తండావాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తక్కళపల్లి రవీందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, కేవీ.సుబ్బారెడ్డి, మేర్గు విజయ్, ఈదునూరి సాయికృష్ణ, సింగం ప్రశాంత్, రమేశ్ యాదవ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పునీత భోజప్ప మహోత్సవం

చెన్నారావుపేట : మండలంలోని జోజిపేటలో పునీత బోజప్ప మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, విచారణ గురువు యాగారెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఏసుక్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, నాగోతు ఆరోగ్యం, చిన్న దాసయ్య, శౌరి, దాసరి దిలీప్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం మేరు కార్పొరేషన్‌ను ప్రకటించిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మేరు సంఘం పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు రామగిరి రవికుమార్, వోడపెల్లి గోవర్ధన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మాధవరెడ్డి బీసీలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేరు సంఘం జిల్లా కోశాధికారి రామగిరి యాదగిరిస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి గట్ల రజనీకాంత్, మాజీ అధ్యక్షుడు గట్ల రఘుపతి, పట్టణ ఉపాధ్యక్షులు గట్ల శ్రీను, నోముల భాస్కర్, గట్ల కమలాకర్, మండల ఉపాధ్యక్షులు రామగిరి భిక్షపతి, సహాయ కార్యదర్శి ఓడెల సురేశ్, రామగిరి రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువతికి..



పర్వతగిరి : ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మండల కేంద్రానికి చెందిన పూజారి సువర్ణను ఆమె భర్త సురేశ్‌ను సువర్ణతో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు మంగళవారం శాలువా కప్పి సన్మానించారు. జీవితంలో మరింత ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సువర్ణ స్నేహితులు భాగ్యలక్ష్మి, స్వప్న, నవీన్, నరేశ్, రఘు, సుమన్, దేవ్లా నాయక్, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

కడియం కావ్యకు..

పర్వతగిరి : వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్యను హనుమకొండలోని నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం కడియం కావ్య మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

విరాళం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన చింతకాయల మహేశ్వరి సురేశ్ మంగళవారం రూ.50 వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు అభినందించారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన నారోజు ఉపేంద్రచారి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి టెన్త్ నాటి మిత్రులు మంగళవారం రూ.25 వేల సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపేంద్రచారి స్నేహితులు తుమ్మ రాంరెడ్డి, లెక్కల రవీందర్ రెడ్డి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలోని ఆలయంలో లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వేదపండితులు పరాశరం సుదర్శనాచారి, భరత్, కిరణాచార్యులు, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో వేడుక చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించారు. అర్చకులు కల్యాణాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భక్తులు దొంతరబోయిన సోమలక్ష్మి, మల్లికాంబ, సారమ్మ, యాదమ్మ, రమ్య, ముద్రబోయిన సమ్మక్క, రజిత, అన్నెపు వెంకన్న, గడ్డం నరేందర్, మడిపెద్ది నాగార్జున్, సుధగాని భరత్, ఉప్పుల శివ, మారోజు వెంకటేశ్వర్లు, దొంతరబోయిన రామదాసు, సోమయ్య, బండి రామ్మూర్తి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు



సురేశ్‌ను అభినందిస్తున్న నాయకులు

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుపై ఆరోపణలు తగదని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మైన సురేశ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి అన్నారు. పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సురేశ్‌కుమార్‌ను నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సురేశ్‌కుమార్, సారంగపాణి మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఎమ్మెల్యేగా ఎంపిక చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే నాగరాజును ఓడించాలని కొందరు నాయకులు చూశారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ నుంచి ఓ నాయకుడికి ప్యాకేజీ ఇప్పించి ఆ పార్టీలోకి పంపించి తిరిగి ఎమ్మెల్యేగా నాగరాజు గెలుపొందగానే అనుమతి లేకుండా, సమాచారం ఇవ్వకుండా పార్టీలోకి తీసుకోవడం అవమానించడం కాదా అని ప్రశ్నించారు. వీరాభిమానంతో ఆర్థిక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా పార్టీ ఎదుగుదలకు కృషి చేసిన నాయకుల, కార్యకర్తల భవిష్యతును తాకట్టు పెట్టి స్వప్రయోజనాలు చూసుకుని క్యాడర్‌ను వదిలేసిన నాయకులెవరో అందరికీ తెలుసన్నారు. నాయకులు క్రమశిక్షణ ఉల్లంఘణలకు పాల్పడడం సరికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మండలం నుంచి అధిక మెజారిటీ తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో నాయకులు మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్, భీమానాయక్, సిలువేరు శ్రీధర్, బెజ్జం పాపారావు, ఆరెల్లి ప్రభాకర్, మహబూబ్ నాయక్, బాబులాల్, గుజ్జ వీర రాఘవరావు, పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, పెద్దబోయిన దేవేంద్ర, పాక సుజాత, బక్కతట్ల రాజు, చందు రవి, రామగిరి వంశీ, రంజిత్, శేఖర్, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

చెన్నారావుపేట : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని భోజెర్వు గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు ధీకొండ నాగేశ్వర్ (44) వృత్తిలో భాగంగా సాయంత్రం తాటిచెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పత్తి సాగుపై అవగాహన

వర్ధన్నపేట : పట్టణంలోని రైతువేదికలో రైతులకు పత్తి సాగుపై కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానాలు తెలిపారు. సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సౌమ్య, మండల వ్యవసాయాధికారి రాంనర్సయ్య, ఎంఈఓ మౌనిక, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి వేలం 24కు వాయిదా

నెక్కొండ : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి (వారాంతపు సంత) వేలంను ఈనెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపీఓ సునీల్‌కుమార్, ఈఓ సదానందం తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాయలయంలో మంగళవారం రెండోసారి గ్రామ ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ అధ్యక్షతన వేలం నిర్వహించారు. మేకలు–గొర్రెలకు గతంలో రూ.36 లక్షలు ఉండగా రూ.10.50 లక్షలకు, తైబజారుకు రూ.7 లక్షలకుగాను లక్ష 45 వేలకు మాత్రమే గుత్తేదారులు పాట పాడారు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన (అప్‌సెట్ ప్రైజ్) ధర కంటే తక్కువకు వేలం పాడడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా వేసినట్లు వారు వివరించారు. మళ్లీ ఈనెల 24న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుత్తేదారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఈఓ సదానందం

నేటి నుంచి కొమ్మాల అంగడి వేలం

గీసుకొండ : మండలంలోని కొమ్మాల అంగడి వేలం పాటలను నిర్వహించే తేదీలను ఖరారు చేసినట్లు ఎంపీఓ ఆడెపు ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని దస్రుతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నేడు (20), 21న నందనాయక్‌తండాలో, 22న కొమ్మాలలో వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు రూ.2 లక్షల ధరావతు సొమ్మును డీడీ రూపంలో బ్యాంకులో చెల్లించి పంచాయతీ కార్యాలయంలో అందజేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయక్

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలో గోపనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగార్జున అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో శ్రీనివాస్‌నాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడానికి కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని తెలిపారు. సమావేశంలో మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాధిక, రాజు, నాయకులు పాషా, సావిత్రి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

సంగెం : త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల జరగనున్న క్రమంలో పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు చేశారు. ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలాజీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంగెం : విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ పండగ వాతావరణం నెలకొంది. మండలంలోని సిద్దార్థ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు ఉపాధ్యాయులను తలపించేలా బాధ్యతలు నిర్వర్తించి అబ్బురపర్చారు. తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. డీఈఓగా పృథ్వీ, ప్రధానోపాధ్యాయుడిగా వీక్షిత్, ఇన్‌చార్జ్‌గా రిషత, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. ప్రతిభ చాటి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఇన్‌చార్జ్ ఫిజానాస్, ఉపాధ్యాయులు నాగమణి, వందన, స్వప్న, కవిత, మౌనిక, శాంతకుమారి, ప్రవళిక, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఖానాపురం : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండలంలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సూచించారు. పాఠశాలను వారు మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం నిర్వాహకులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, సంపత్‌కుమార్, అజ్మీర రాజునాయక్, కుమారస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



నెక్కొండ : స్థానిక ఎంపీడీఓగా వి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి విధులు నిర్వర్తించిన శ్రీనివాసరావు ఖమ్మం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ కాగా ప్రస్తుతం నర్సంపేట ఎండీపీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్‌కుమార్ ఉద్యోగోన్నతితో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధికి పాటుపడతామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న చెన్నకేశవులు, నాయకులు

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ పద్మశాలి సంఘం పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం సంఘం మండల, పట్టణ అధ్యక్షులు కుసుమ చెన్నకేశవులు, రాపాక కట్టయ్య మాట్లాడారు. పేద పద్మశాలి కులస్తులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పేరాల ఉపేందర్, కుడికాల రఘువీర్, రాపాక సందీప్, రాపాక కట్టయ్య, నల్ల అశోక్, గడుదాసు వేణుగోపాల్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చెన్నారావుపేట : మండలంలోని ధర్మతండాలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూక్య శంకర్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి కేటాయించిన నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంద యాకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, బోడ రవి, భూక్య భాస్కర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అమీరుద్దీన్, బండి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుడిపెల్లి ధర్మారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ రూపిక శ్రీనివాస్, వేముల రవీందర్, ఓరుగంటి తిరుపతి ఆధ్వర్యంలో పలువురు చేరగా వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, నాయకులు మట్ట రాజు, బొమ్మినేని భరత్‌రెడ్డి, సాంబయ్య, శ్రీరామోజు ప్రభాకర్, కంచరకుంట్ల నర్సింహారెడ్డి, నాగరబోయిన చిన్న నర్సయ్య పాల్గొన్నారు.

ఐస్‌క్రీమ్ విక్రేత అసభ్య ప్రవర్తన

సోషల్ మీడియాలో వీడియో వైరల్

- పోలీస్ కేసు నమోదు
- కల్తీపై అధికారుల విచారణ



ఐస్‌క్రీమ్ బండి వద్ద విచారణ చేస్తున్న అధికారులు

నెక్కొండ : చిన్నపిల్లల నుంచి పెద్దల దాకా ఎంతో ఇష్టంగా తినే ఐస్‌క్రీమ్‌లో తినకూడని పదార్థాలను కలిపి విక్రయిస్తూ, అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి వీడియో సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వీడియో వైరల్ కాగా దాని ఆధారంగా ఐస్‌క్రీమ్ విక్రేతపై ఎస్సై మహేందర్ మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కాలురం కుర్బియా కొంతకాలంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఐస్‌క్రీమ్ బండి నడుపుతున్నాడు. ఐస్‌క్రీమ్‌లో తినకూడని పదార్థాలను కలిపి విక్రయిస్తున్నాడు. బహిరంగ ప్రదేశంలో సదరు వ్యక్తి అసభ్య ప్రవర్తనపై వచ్చిన వీడియోతో విచారించారు. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంతో విచారణ చేశామని ఎస్సై పేర్కొన్నారు. తినుబండారాల్లో కల్తీ జరిగిందా అనే కోణంలో విచారణలో భాగంగా శాంపిళ్లను సేకరించి, ల్యాబ్‌కు పంపించామని ఎస్సై తెలిపారు.

ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

వర్ధన్నపేట : గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, వీఓ సహాయకులు 2023–24 ఆర్థిక సంవత్సర శాసనాత్మక ఆడిట్‌కు రికార్డులను సిద్ధం చేయాలని డీఆర్డీఏ సెర్ప్ ఏపీఎం వీర్ల వేణు తెలిపారు. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో రికార్డులను మంగళవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి (ఈనెల 20) నుంచి 26 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో అంతర్గత ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పుస్తక నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత వీఓఏలపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు అరుణ, సీబీఓ అడిటర్ సంపత్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, అనిల్, ఎంఎస్పీ రేవతి, సిస్టం ఆపరేటర్ మురళి, వీఓఎలు సుభద్ర, శోభ, స్రవంతి, ఆకారపు అనిత, కొండేటి సుమన్, మంజుల, కవిత, జ్యోతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరల్లో పోషక విలువలు పుష్కలం

చెన్నారావుపేట : ఆకుకూరల్లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, ఊదుగుల రజిత తెలిపారు. ఉప్పరపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన పోషక పక్వాడ్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆకుకూరలు, కూరగాయలు పోష్టికాహారమని చెప్పారు. తల్లులు, గర్భిణులు, చిన్నారులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తొలుత చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆయాలు నీలమ్మ, కట్టమ్మ, శారద, ఆశ వర్కర్లు మాదుగుల లత, అయేషా, రాజమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్

శిక్షణతో మత్స్యకారులకు ఉపాధి



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ జయశ్రీ

దుగ్గొండి : మత్స్య సహకార సంఘాల పాలకవర్గ సభ్యులకు నిర్వహించిన శిక్షణతో మత్స్యకారులకు ఉపాధి లభించనుందని ప్రకృతి పర్యావరణ సంస్థ సీఈఓ మూగ జయశ్రీ తెలిపారు. మండలంలోని గిర్నిబావిలో ఆ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. సంఘాల పనితీరు, పాలకవర్గ సభ్యుల విధులను వివరించారు. అనంతరం జయశ్రీ మాట్లాడారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సహకారంతో ఏర్పాటైన సహకార సంఘాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అన్ని సంఘాలు లాభాలు ఆర్జించి సభ్యులు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల ప్రాజెక్టు ఇన్‌చార్జ్ వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

సంగెం : టీకాలు వేయించడం ద్వారా పశువులను వ్యాధుల బారి నుంచి రక్షించవచ్చని మండల పశు వైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు తెలిపారు. మండలంలోని కృష్ణానగర్‌లో పశువులకు మంగళవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువులకు వ్యాధి సోకిన తర్వాత చికిత్స చేయించే బదులు ముందస్తుగానే నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమమని చెప్పారు. పాడిరైతులు, పశు పోషకులు తమ ఆవులు, గేదేలు, ఎద్దులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించి రోగాల బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు కమలాకర్, బాబు, జితేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



టీకా వేస్తున్న పశు వైద్యాధికారి రాజు

'టీకా వికటించి ఆవుదూడ మృతి'

సంగెం : గాలికుంటు వ్యాధి నివారణ టీకా వికటించి తన ఆవుదూడ మృతి చెందిందని రైతు ఆరోపించాడు. మండలంలోని కుంటపల్లికి చెందిన కావటి నగేష్ మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. హెచ్ఎఫ్ సంకరజాతికి చెందిన నాలుగేళ్ల వయస్సున్న తన ఆవుదూడకు ఈనెల 18న గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించినట్లు తెలిపాడు. టీకా వేసిన రెండు గంటల తర్వాత ఆవుదూడ మేత తినడం, నీరు తాగడం మానేయగా విషయాన్ని మండల పశువైద్యాధికారి రాజు దృష్టికి ఫోన్‌లో తీసుకెళ్లగా ఏం కాదు, జ్వరం వచ్చి ఉంటుందని తెలిపాడని చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం ఆవుదూడ మృతి చెందిందని రైతు తెలిపాడు. రూ.40 వేల విలువైన ఆవు దూడ మృతికి పరిహారం చెల్లించాలని నగేష్ డిమాండ్ చేశాడు.

టీకాతో పశువులు చనిపోవు..

గాలికుంటు నివారణ టీకాలు చాలా ఏళ్లుగా పశువులకు వేస్తుండగా ఇప్పటివరకు టీకా వికటించి పశువు చనిపోయిన దాఖలాల్లేవని మండల పశువైద్యాధికారి రాజు తెలిపారు. పోస్టుమార్టమ్ నిర్వహించామన్నారు. నివేదిక వస్తే ఆవుదూడ మృతికి గల కారణం తెలుస్తుందని వివరణ ఇచ్చారు.



ఆవుదూడ మృతదేహం వద్ద విలపిస్తున్న రైతు